తీరని వాంఛ :

# కాలం కర్మం కలిసిరానప్పుడు

● దాసరి వెంకటరత్నం ●

ఎప్పుడో నాలుగేళ్ళ క్రితం (అంటే నేను ఎస్.ఎస్.ఎల్.సి చదువుతున్నప్పుడు) మా నాన్న అమ్మ నాకు పెళ్ళిచెయ్యాలని ఉబలాటపడి చేసే ఉంతటి హడావిడి చేసేరు. ఆ రోజుల్లో వుండే విద్యాపేక్షవల్లనో లేక కుర్రతనంవల్లనో బి.ఎ. పాసయ్యేవరకు పెళ్ళిచేసుకోనని. నిస్సందేహంగా. నిర్భీతిగా ముఖాముఖిని చెప్పేను బస్ దాంతో అంటే ఆ నా మాటతో. ఆ తేదీనుండి ఈ తేదీవరకు నా పెళ్ళి ప్రసంగమే లేదు.

ఆ నాడు పెళ్ళంటే ఏమిటో తెలుసుకోలేని కాళీబుర్రతో అన్నమాటకుగాను ఈ నాడు అన్నీ తెలిసికోగలుగుతున్న ఈ నిండుబుర్రతో బాధ పడలేక పెత్తెత్తి చస్తున్నాను. నా స్నేహితులందరికీ ఆ రోజుల్లోనే పెళ్ళిళ్లయి పిల్లల్ని కంటూ ముచ్చటగా నాతోనే చదువును సాగిస్తున్నారు. ఎటొచ్చీ మా మిత్రబృందంలో బ్రహ్మచర్యంతో యిప్పటివరకు బాధపడుతూ కాలాన్ని గడువుతున్నవాడ్ని నే నొక్కడినేనని చెప్పకోక తప్పిందికాదు.

మనలో మనమాట. "తల్లిదండ్రులు వచ్చి, "అబ్బాయ్ పెళ్ళిచేసుకుంటావా?" అని అడిగితే ఎంత వాంఛించేవాడైనా, భయభక్తుల్ని, సిగ్గుబిడియాల్ని విడిచి ఎట్టఎదుట చేసుకుంటానని ఏ కొడుకు చెప్పగలడు చెప్పండి?

ఆ నాడు చేసుకుంటానని చెప్పలేక పోబట్టే ఈ నాడు హాయిగా గడపాల్సిన నిండువెన్నెలలో విసుగుతో పుస్తకాల్ని ప్రక్కకు నెట్టి, నెమ్మదిగా వీచే చల్లని పిల్లతెమ్మెరలతోపాటు తీయని అతిమృదుమధురమైన కోర్కెల్ని, వాంఛల్ని రేకెత్తించుకొని, ఆనందించి, మహదానందించి, మరచి, మైమరచి ఎప్పుడో అక్కడే ఆ కుర్చీలోనే నిద్రపోయి ఏవేవో కలల్నికంటూ సంతృప్తి నొందుతున్నాను.

ప్రతిరోజూ కాలేజీకి వెళ్ళడానికి ఇష్టంవున్నా లేకపోయినా తప్పకుండా వెళ్ళి, తరుణీమణుల తళుకుబెళుకుల సోయగాన్ని, మృదుత్వాన్ని చూసి తనివితీరక మళ్ళీ చూసి, మళ్ళీ చూసి: తృప్తి పడలేక అసంతృప్తిపడి, ఏదో బాధను పొందుతూ ఎక్కడికో వెళ్ళి, అలా వెళ్ళి, ఎప్పటికో ఎక్కడికో జేరుకుంటున్నాను.

మొన్నను వేసంగి సెలవలకు ఇంటికెళ్ళినప్పుడు మాటమీద మాటొచ్చి "ఇప్పుడు పెళ్ళిచేస్తే నీ బి.ఎ. చదువు బెబ్బే అవుతుందని, వచ్చేసంవత్సరము చెయ్యాలని అనుకుంటున్నారు మీ నాన్నగారు" అంది అమ్మ.

"చదువుకి పెళ్ళికి సంబంధ మేమిటమ్మా! చదువుదారి చదువుదే పెళ్ళిదారి పెళ్ళిదే:" నన్నాను.

"అబ్బో యిలాగ చెప్పి చదువును ఎగవేసిన వారు చాలమందివున్నారు" అంది.

"వాళ్ళందరిమాట నాకేం గావాలి. నా ఆత్మశక్తి, కార్యదీక్ష నాకు తెలుసు కనుక నే నిట్లా మాట్లాడుతున్నా"నన్నాను.

"ఇప్పటి ఆత్మశక్తి, కార్యదీక్ష పెళ్ళామొస్తే వుండవురా నాయనా! బి.ఎ. అంటే చదువుతున్నావుగాని అనుభవమేది నీకు" అంటూ మేడ క్రిందికి వెళ్ళిపోయింది.

ఈ మాటల ధోరణినిబట్టి వాళ్ళ అభిప్రాయాన్ని గ్రహించిన నేను మళ్ళీ వచ్చేసంవత్సరము ఎల్లా గడపనా అని ఆలోచిస్తూ ప్రక్కనేవున్న ఈజీఛైర్‌లో కూలబడ్డాను.

ఇంతకంటె ఏం చెయ్యను మరి కాలం, కర్మం కలిసిరానప్పుడు.